# అలంకారప్రాయంగా ట్రాఫిక్ సిగ్నల్స్

- ఇష్టానుసారంగా వాహనదారుల రాకపోకలు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు



పట్టణంలోని నంది చౌరస్తా వద్ద ఇష్టారాజ్యంగా వెళ్తున్న వాహనదారులు

కోరుట్ల, జూన్ 15: కోరుట్ల పట్టణంలో ఏడాదిగా ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థ పని చేయడం లేదు. పట్టణంలోని నంది చౌరస్తా, కల్లూరు రోడ్డు క్రాసింగ్ వద్ద జాతీయ రహదారిపై ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. నిజామాబాద్, జగిత్యాల, వేములవాడ పట్టణాలకు వెళ్లేందుకు ప్రధాన రహదారిగా ఉన్న కోరుట్లలోని జాతీయ రహదారిపై రాకపోకలు సాగించేందుకు ఏకైక మార్గంగా ఉంది. బైపాస్ రోడ్డు లేని కారణంగా వందలాది చిన్న, భారీ వాహనాలు కూడా ఈ రహదారి గుండానే ప్రయాణించాల్సి ఉంది. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సిగ్నల్స్ పని చేయక మితిమీరిన వేగంతో వచ్చే వాహనాలు, ఇష్టానుసారంగా వాహనాల రాకపోకలతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాలతో పాటు ఈ రెండు చౌరస్తాల నుంచి రోడ్డుపైకి చేరే క్రమంలో ట్రాఫిక్ నియంత్రణ లేక వాహనదారులు అయోమయానికి గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులు సైతం ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిత్యం రద్దీగా కొత్త బస్టాండ్, నంది చౌరస్తా, కల్లూరు రోడ్డు క్రాసింగ్ వద్ద ట్రాఫిక్ నియంత్రణకు ట్రాఫిక్ కానిస్టేబుల్ ఏర్పాటు చేయాలని, సిగ్నల్స్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్‌ను వివరణ కోరగా, ట్రాఫిక్ సిగ్నల్స్‌కు మరమ్మతులు చేపట్టి త్వరలోనే వినియోగంలోకి తీసుకువస్తామని తెలిపారు.



పట్టణంలోని మార్కండేయ వీధిలో గుంతలు పడి అధ్వానంగా మారిన అంతర్గత రోడ్డు



పోచమ్మ వాడలో..

# అధ్వానంగా అంతర్గత రోడ్లు

- మరమ్మతులు చేపట్టాలని మెట్‌పల్లి పట్టణ వాసుల వేడుకోలు

మారుతీనగర్, జూన్ 15 : మెట్‌పల్లి పట్టణంలోని పలు కాలనీల్లో సీసీ రోడ్లు (అంతర్గత రోడ్లు) గుంతలు పడి అధ్వానంగా మారాయి. దీంతో ఆయా కాలనీలవాసులు నడవాలన్నా, ద్విచక్ర వాహనంపై వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వానకాలంలో గుంతల్లో నీరు నిలిచి ప్రమాదాలు జరిగే అవకాశముందని కాలనీలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పెగడపల్లి, జూన్ 15: పెగడపల్లి మండలం నంచర్ల జడ్పీ పాఠశాల ఆవరణలో ఆదివారం 2001-2002 పదో బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులు లింగంపల్లి లచ్చయ్య, గంగారెడ్డి, రవీందర్‌రెడ్డి, భూమయ్య, భీమయ్య, శ్రీనివాస్‌ను ఓపెన్ టప్ జీపులో పూర్వ విద్యార్థులంతా ఊరేగింపుగా పాఠశాలలోకి తీసుకొచ్చారు. అనంతరం వారిని శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మల్లేశం, సత్తిరెడ్డి, వేణు, రాజశేఖర్, శ్రీధర్, మనోహర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## నాన్నే మార్గదర్శి..

కమాన్‌చౌరస్తా, జూన్ 15 : ప్రతి ఒక్కరి జీవితంలో నాన్నే మార్గదర్శిగా నిలుస్తారని, ఆయన చూపిన దారిలో పిల్లలు నడుస్తారని ఎంజేబీటీ జాయింట్ సెక్రటరీ జీవీ శ్యాంప్రసాద్ లాల్ పేర్కొన్నారు. కరీంనగర్‌లోని ఫిలిం సొసైటీలో ఆదివారం సమైక్య సాహితీ విశిష్ట పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి శ్యాంప్రసాద్ లాల్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. నాన్నల దినోత్సవం సందర్భంగా తన తండ్రిని గుర్తుచేసుకోవడం ఆనందంగా ఉన్నదన్నారు. గత ఎనిమిది సంవత్సరాల నుంచి విశిష్ట పురస్కారాల ప్రదానోత్సవం నిరాటంకంగా కొనసాగుతున్నదని తెలిపారు. ఈ క్రమంలో జీవీ శ్యాంప్రసాద్ లాల్ ప్రదాతగా ఆచార్య రజనీశ్రీ నృత్య పురస్కారం డాక్టర్ పేరిణి కుమార్‌కు, కేఎస్ అనంతాచార్య ప్రదాతగా కలకుంట్ల సంపత్ కుమారాచార్య సంగీత పురస్కారం లక్ష్మీ శేషాచార్యులకు, రావికంటి శ్రీనివాస్ ప్రదాతగా రావికంటి రామయ్య గుప్త సాహితీ పురస్కారం డాక్టర్ రంగాచార్యకు, మాడిశెట్టి గోపాల్ ప్రదాతగా మాడిశెట్టి మల్లయ్య ఉపాధ్యాయ పురస్కారం బెజ్జారపు వినోద్ కుమార్‌కు, డాక్టర్ రఘురామన్ ప్రదాతగా డాక్టర్ దారం నాగభూషణం పురస్కారం ఆచార్య అడపా సత్యనారాయణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గంగ్ర లక్ష్మణ రావు, డాక్టర్ కలువకుంట రామకృష్ణ, కొత్త అనిల్ కుమార్, డాక్టర్ బీవీఎన్ స్వామి, గాజుల రవీందర్, అనుపమ, డాక్టర్ శ్రీనివాసాచారి, నాగేంద్రశర్మ, నామని సుజనాదేవి పాల్గొన్నారు.

## 17న టీజీఎంఈయూ ఆవిర్భావ దినోత్సవం

విద్యానగర్, జూన్ 15: తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (టీజీఎంఈయూ) ఆవిర్భావ దినోత్సవాన్ని ఈ నెల 17న ఘనంగా జరుపుకోవాలని టీజీఎంఈయూ రాష్ట్ర కార్యదర్శి, కామ్రేడ్ టీ రామారావు ఒక ప్రకటనలో కోరారు. యూనియన్‌లో ఉన్న అన్ని క్యాడర్ల ఉద్యోగుల సమస్యలపై పోరాటాలు చేసి, విజయం సాధించడంపై గర్విస్తున్నామని పేర్కొన్నారు. తోటి ఉద్యోగులైన కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు రెగ్యులరైజ్ అయ్యే వరకు వారు చేసే పోరాటాలకు యూనియన్ అండగా ఉంటుందని ప్రకటించారు.

## ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

హుజూరాబాద్ టౌన్, జూన్ 15: ఆర్టీసీ యాజమాన్యం రిటైర్డ్ కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు, ఆసరా పెన్షన్లు అందించాలని ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుల సంఘం కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు గోస్కుల ముత్యంరాజు కోరారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## నేడు జగిత్యాలలో ఎమ్మెల్సీ కవిత పర్యటన



జగిత్యాల, జూన్ 15: జిల్లా కేంద్రంతో పాటు మండలంలోని పొలాస గ్రామంలో నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోమవారం పర్యటిస్తారని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు పొలాసలో ప్రగతి విజ్ఞాన్ పాఠశాలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో మీ అండ్ మినీ వస్త్రాలయాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఉదయం 11 గంటలకు నవదుర్గా ఆలయాన్ని సందర్శించి, కుంకుమ పూజలో పాల్గొంటారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.

## నేడు ప్రజావాణి

జగిత్యాల, జూన్ 15: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి నిర్వహించనున్నట్లు కలెక్టర్ సత్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సమస్యలపై అర్జీలు అందజేయాలని పేర్కొన్నారు.

## లోక్ అదాలత్‌లో 34 కేసులు పరిష్కారం

కథలాపూర్, జూన్ 15: లోక్ అదాలత్‌లో కథలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 34 కేసులు పరిష్కారమైనట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ ఆదివారం తెలిపారు. కోరుట్ల కోర్టులో శనివారం లోక్ అదాలత్ నిర్వహించగా, జడ్జి సమక్షంలో 34 కేసులు పరిష్కరించినట్లు పేర్కొన్నారు.

## పేద విద్యార్థికి ఆర్థిక చేయూత



రంజిత్‌కు నగదు అందజేస్తున్న సూరజ్ శివశంకర్

జగిత్యాల, జూన్ 15: మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం రాయపేట గ్రామానికి చెందిన నిరుపేద రంజిత్ హైదరాబాద్‌లోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బుక్స్, హాస్టల్ ఫీజు చెల్లించడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. రంజిత్ మిత్రుల ద్వారా విషయం తెలుసుకున్న జగిత్యాలకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు సూరజ్ శివశంకర్ ఆదివారం వెళ్లి రూ.12 వేల నగదు అందజేశాడు.

## ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అందజేత

ఇబ్రహీంపట్నం, జూన్ 15: ఇబ్రహీంపట్నం మండలం యామాపూర్ గ్రామంలోని గుడేటి ఫంక్షన్ హాల్‌లో 466 మంది లబ్ధిదారులకు కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఆదివారం ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అందజేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇండ్లు నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగాం రాజు, వైస్ చైర్మన్ ఎలాల వెంకటరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నేరేళ్ల దేవేందర్, మహిళా అధ్యక్షురాలు లక్కడి నర్సవ్వ, పీఏసీఎస్ చైర్మన్ అంకతి రాజన్న, నాయకులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★Wanted Female Accountants, Qul: B.Com(Accounts), Exp: 2 Yrs in Tally Software, Job Location Karimnagar, Salary: 12K-15K per Month, Negotiable, Interested candidates can send resume: 8977919477 (Whatsup), email: anilcholleti.ca@gmail.com.
NTK-350007

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189

## అంబేద్కర్‌కు నివాళి



శ్రీకాంత్ రెడ్డికి అంబేద్కర్ చిత్రపటాన్ని అందజేస్తున్న నాయకులు

జగిత్యాల రూరల్, జూన్ 15: ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం అంబేద్కర్ స్మరణ కార్యక్రమంలో భాగంగా జగిత్యాలలోని తహసీల్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ అధ్యక్షుడు ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, అంబేద్కర్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఐసీసీఐ జిల్లా కన్వీనర్ నల్ల శ్యామ్, నాయకులు మద్దెల నారాయణ, చిత్తారి ప్రభాకర్, నక్క విజయ్, చిట్టి బాబు, నర్ర రాజేందర్, జవ్వాజి శంకర్, సురేందర్, కంటే అంజయ్య, పులి గోవర్ధన్, పొనగంటి రాజన్న, లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

## పెద్దాపూర్ గురుకులంలో ముందస్తు చర్యలు



పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిలిచి ఉండకుండా చదును చేస్తున్న ట్రాక్టర్

మారుతీనగర్, జూన్ 15: మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిలిచి ఉండకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి, నీరు నిల్వ ఉన్న చోట మట్టి పోసి చదును చేస్తున్నారు. ఇప్పటికే ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు గురుకులానికి సుమారు 40 మంది వరకు రాగా, సోమవారం నుంచి విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని ఉపాధ్యాయులు తెలిపారు.

## ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ

ధర్మపురి, జూన్ 15: ధర్మపురి క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొదట గోదావరి నదిలో స్నానాలాచరించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో స్వామివారలను దర్శించుకొని, పూజలు చేశారు. భక్తుల సౌకర్యార్థం సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

## కార్యవర్గం



ఎన్నికైన ముస్లిం కమిటీ సభ్యులు

పెగడపల్లి, జూన్ 15: మండలంలోని బతికపల్లిలో ముస్లిం కమిటీ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. కమిటీ సదర్‌గా సయ్యద్ అన్వర్ పాషా, నాయబ్ సదర్‌గా సయ్యద్ అఫ్జల్, ప్రధాన కార్యదర్శిగా ఎండీ రజాక్, కోశాధికారిగా ఎండీ కరీం, కార్యవర్గ సభ్యులుగా షేక్ హైదర్ షకీల్, మౌలానా, సాజిద్, జలీల్, ఇమామ్, రషీద్, షానువాజ్, సల్మాన్, జున్ను, ఇమ్రాన్, జుబేర్, జెహాన్, షాద్ ఎన్నికయ్యారు.

## నేడు వీడియో కాన్ఫరెన్స్

సారంగాపూర్, జూన్ 15: రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని రైతు వేదికల్లో సోమవారం సాయంత్రం 4 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్ రెడ్డి రైతులతో ముఖాముఖీ కార్యక్రమం ఉంటుందని సారంగాపూర్ ఏవో ప్రదీప్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సారంగాపూర్ మండల కేంద్రంతో పాటు కోనాపూర్, బీర్‌పూర్ మండలం బీర్‌పూర్, కండ్లపల్లి గ్రామాల్లోని రైతు వేదికల్లో నిర్వహించే కార్యక్రమానికి మండలంలోని ఆయా గ్రామాల రైతులు, మాజీ ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కాగా, ఆయా రైతు వేదికల్లో ఆదివారం వ్యవసాయాధికారులు వీడియో కాన్ఫరెన్స్ ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఏఈవోలు వెంకటేశ్, ఆంజనేయులు, వినోద్, తదితరులు పాల్గొన్నారు.


## వృద్ధుల సంక్షేమానికి సర్కారు కృషి

జగిత్యాల, జూన్ 15: వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నదని, కలెక్టర్ సత్యప్రసాద్ ఆధ్వర్యంలో చట్టం పకడ్బందీగా అమలవుతున్నదని ఆర్డీవో పులి మధుసూదన్ గౌడ్ పేర్కొన్నారు. జగిత్యాలలోని తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో ఆదివారం వయో వృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా 26 మంది విశిష్ట వయో వృద్ధులు, ఆరుగురు ఉత్తమ కూతుళ్లు, ఆరుగురు ఉత్తమ కుమారులు, ఆరుగురు ఉత్తమ కోడళ్లను ఆర్డీవో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వయోవృద్ధులను వేధిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్, జిల్లా కౌన్సెలింగ్ అధికారి హన్మంత రెడ్డి, కోశాధికారి వెలముల ప్రకాశ్ రావు, ఉపాధ్యక్షులు బొల్లం విజయ్, ఎండీ యాకూబ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు పూసాల అశోక్ రావు, సత్యనారాయణ, పబ్బా శివానందం, రాజ్‌మోహన్, లక్ష్మీనారాయణ, వొజ్జల బుచ్చిరెడ్డి, సౌడాల కమలాకర్, వెల్ముల ప్రభాకర్ రావు, రాజేశ్వర్, నక్క ఇంద్రయ్య, దేవేందర్ రావు, కొక్కు నారాయణ, ఎండీ ఇక్బాల్, సయ్యద్ యూసుఫ్, పుత్రయ్య, త్యాగరాజు, యాకూబ్ హుస్సేన్, ఉమ్మడి జిల్లా విద్యార్థి జేఏసీ అధ్యక్షుడు దోనూరి భూమాచారి, వివిధ సంఘాల ప్రతినిధులు రాజ్ గోపాల్ చారి, సింగం గంగాధర్, నలువాల హన్మాండ్లు, రాంచంద్రం, సింగం భాస్కర్, పుప్పాల నర్సింగా రావు, అనుమల్ల సత్తయ్య, శ్రీమంజరి, జలజ, పద్మ, దేవేంద్రమ్మ, కరుణ పాల్గొన్నారు.

## చల్‌గల్‌లో ఉచిత వైద్య శిబిరం

జగిత్యాల, జూన్ 15: జగిత్యాల రూరల్ మండలం చలిగల్ గ్రామంలో ఆదివారం పట్టణంలోని సాయి స్వాస్థ్య వెల్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఎన్నాకుల రాము సుమారు 72 మందికి వివిధ పరీక్షలు చేసి, అవసరమున్న వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సుజల స్రవంతి ట్రస్టు సభ్యులు బాపట్ల సీతారామరాజు, పాల్తేపు భూమేశ్వర్, కార్యదర్శి శ్రీనివాస్, ఉత్తూరి వాసు, నాగలింగం, సునీత, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

## పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

మేడిపల్లి, జూన్ 15: భీమారం మండలం రంగాపూర్ గ్రామంలో ఆదివారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ జీవిత చరిత్రపై రాసిన 'ఒక ప్రస్థానం' పుస్తకాన్ని ఉమ్మడి మేడిపల్లి మండల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కొప్పుల ఈశ్వర్ సింగరేణి కార్మిక సంఘ విప్లవ నేతతో మొదలై గొప్ప రాజకీయ వేత్తగా ఎదిగి అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. సామాజిక, రాజకీయంగా మంచి సేవలందించిన నాయకుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నెల్లుట్ల పూర్ణిమ, ప్రభాకర్, మాజీ సర్పంచ్ ఈర్నాల సంపత్‌కుమార్, నాయకులు కంచి శంకర్, బన్నా రాజేందర్, రజనీష్, మనోజ్‌రావు, అరికెల రమేశ్, వొద్దినేని సాయి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## న్యాయం చేయాలని వేడుకోలు

వీణవంక, జూన్ 15: తనను ప్రేమించి, పెళ్లి చేసుకొని కాపురానికి తీసుకుపోకుండా మోసం చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలంటూ మల్లారెడ్డిపల్లికి చెందిన నిమ్మల విజయ వేడుకొంది. ఆదివారం మండల కేంద్రంలోని ఎంఆర్సీ భవనం ఆవరణలో సీపీయూ ఎస్ఐ పార్టీ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.రమేశ్, ఆడజన్ మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు కలకోటి శారద, జిల్లా కమిటీ సభ్యురాలు రమాదేవితో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడింది. మల్లారెడ్డిపల్లి గ్రామానికే చెందిన కొలిపాక రాకేశ్ తనను ప్రేమిస్తున్నానని చెప్పి సంవత్సరం క్రితం ఓ ఆలయంలో వివాహం చేసుకున్నాడని తెలిపింది. కొంత కాలం చాటుగా కాపురం చేసి, ఏవో కారణాలు చెబుతూ తనను తల్లిగారింట్లో వదిలేసి వెళ్లి పోయాడని ఆవేదన వ్యక్తం చేసింది. కాపురానికి తీసుకుపోకుండా మోసం చేశాడని వాపోయింది. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, అధికారులు జోక్యం చేసుకొని న్యాయం చేయాలని వేడుకుంటున్నది.

## కరీంనగర్‌లో రాష్ట్రస్థాయి ఉషూ సెమినార్

కొత్తపల్లి, జూన్ 15 : కరీంనగర్‌లోని ఫండస్ పాఠశాలలో ఆదివారం రాష్ట్రస్థాయి ఉషూ జడ్జింగ్ సెమినార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఉషూ అసోసియేషన్ అధ్యక్షుడు బార విద్యాసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సెమినార్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన 10 జిల్లాల నుంచి 50 మందికి పైగా కోచ్‌లు హాజరయ్యారు.

## సేవా కార్యక్రమాలతోనే ప్రజల్లో గుర్తింపు



వైద్యుడిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

జగిత్యాల రూరల్, జూన్ 15: సేవా కార్యక్రమాల ద్వారానే ప్రజల్లో గుర్తింపు వస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో 'ఆవో గావో చలో' కార్యక్రమంలో భాగంగా జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. ఆదివారం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్యులు సేవాభావంతో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఐఎంఏ ఆధ్వర్యంలో దేశంలో సుమారు 7 వేల గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ హేమంత్, కార్యదర్శి ఆకుతోట శ్రీనివాస్, కోశాధికారి కోటగిరి సుధీర్, వైద్యులు పద్మిణి, నాగరాజు, రాజశేఖర్, స్వరూప, రజిత, విజయ్, గీతిక, శ్రీధర్, శ్రీనివాస్, నవీణ్, శ్రావన్, పూర్ణచంద్ర, సాయికిరణ్, అర్జున్, ధీరజ్, రవీందర్ రెడ్డి, శేఖర్, నారాయణ, మల్లేశం, కృష్ణమూర్తి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మల్లాపూర్, జూన్ 15: మండల కేంద్రానికి చెందిన నారా తుక్కారం ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులకు ఆదివారం గ్రామానికి చెందిన రాఖీ పటేల్ జయంతి సందర్భంగా ఆయన మిత్రబృందం రూ. 5 వేల నగదు అందజేశారు. ఇక్కడ సభ్యులు ఇల్లెందుల మనోజ్‌కుమార్, లవంగ శివ, కనుక రాకేశ్, కొండవత్తి రాజశేఖర్, ఇషాక్, తదితరులున్నారు.

## యాదవులకు గుర్తింపు వచ్చే వరకు పోరాటం

ఇబ్రహీంపట్నం, జూన్ 15: ప్రభుత్వ, కుల సంఘాలు, పార్టీల పరంగా జిల్లాలోని యాదవులకు గుర్తింపు వచ్చే వరకు పోరాటం చేస్తామని యాదవ సంఘం అడహక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేశ్‌యాదవ్ పేర్కొన్నారు. వేములకుర్తి, యామాపూర్ గ్రామాల్లోని యాదవ సంఘాల్లో ఆదివారం ఆయన సభ్యత్వ నమోదు, సంఘాల బలోపేతం, సమస్యల పరిష్కారం, జనాభా ప్రాతిపదిక యాదవులకు దక్కాల్సిన హక్కుల సాధన, తదితర విషయాలపై చర్చించారు. అనంతరం 66 మందికి సభ్యత్వ నమోదు రసీదులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో యాదవ సంఘాల సభ్యులు తోట్ల చిన్నయ్యయాదవ్, మ్యాదరవేని రామాంజనేయులు యాదవ్, అంకం శంకర్‌యాదవ్, ముక్కెర లింబాద్రియాదవ్, గుండెల నాగేష్‌యాదవ్, ముక్కెర వేణుగోపాల్‌యాదవ్, పంతంగి వెంటేశ్‌యాదవ్, శ్రీనివాస్, మల్లేశ్, సుభాష్, గంగాధర్, మహేశ్, దయానంద్, నర్సయ్య పాల్గొన్నారు.

## జగిత్యాల నుంచి యాదాద్రి, స్వర్ణగిరికి బస్సు సౌకర్యం

జగిత్యాల, జూన్ 15: జగిత్యాల డిపో నుంచి వేములవాడ, కొమురవెల్లి, యాదాద్రి, స్వర్ణగిరి దేవస్థానాల్లో దైవ దర్శనం కోసం ఈనెల 27 నుంచి సూపర్ లగ్జరీ బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు డిపో మేనేజర్ కల్పన తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ బస్సు ప్రతి రోజు ఉదయం 4.30 గంటలకు జగిత్యాల బస్టాండ్ నుంచి బయలు దేరుతుందని, తిరిగి అదే రోజు రాత్రి వరకు జగిత్యాలకు చేరుకుంటుందన్నారు. ఈ సర్వీసులో ప్రయాణికుడికి రూ.880 చార్జీ ఉంటుందని, భక్తులు 30 మంది బృందంగా వస్తే బస్సు కేటాయిస్తామని తెలిపారు. జగిత్యాల డిపో నుంచి కోరుకున్న రూట్లలో సూపర్ లగ్జరీ, ఏసీ బస్సులను అద్దె ప్రాతిపదికన ఇస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బస్సుల కోసం జగిత్యాల డిపో సెల్ నంబర్ 90149 58854, 73828 48338లో సంప్రదించాలని సూచించారు.

## రోడ్డుపై పడిన భారీ వృక్షం

కొడిమ్యాల, జూన్ 15: కొడిమ్యాల మండలం పూడూరు గ్రామంలోని పెట్రోల్ బంక్ సమీపంలో జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిపై ఆదివారం సాయంత్రం భారీ వృక్షం పడిపోయింది. దీంతో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇరువైపులా వాహనాలు కిలోమీటర్ వరకు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న కొడిమ్యాల ఎస్ఐ సందీప్ ఘటనా స్థలానికి వెళ్లి చెట్టును తొలగించి, ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

## కవయిత్రికి పురస్కారం



కమలను సన్మానిస్తున్న కళాశ్రీ సంస్థ సభ్యులు

జగిత్యాల టౌన్, జూన్ 15: జిల్లా కేంద్రంలోని వాణీనగర్‌లో కవయిత్రి రుద్రంగి కమలను కళాశ్రీ పురస్కారంతో సత్కరించి అభినందించినట్లు కళాశ్రీ ఈశ్వరమ్మ సాహిత్య పీఠం అధినేత గుండేటి రాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు కవులు చేసిన కవితా గానం అలరించింది. ప్రతి నెల వర్ధమాన కవులను వెలుగులోకి తీసుకొచ్చే కార్యక్రమంలో భాగంగా ఆదివారం రుద్రంగి కమలకు పురస్కారం అందజేసినట్లు గుండేటి రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు అయిత అనిత, మద్దెల సరోజన, కొరిడె రమాదేవి, కటుకం కవిత, శ్రీలక్ష్మి, ములస్తం లావణ్య, రుద్రంగి రాధా, రుద్రంగి రమాదేవి, ముత్యం భాగ్యలక్ష్మి, డాక్టర్ శ్యామ్ సుందర్, గంగాధర్, మాణిక్యం, ప్రభాకర్ పాల్గొన్నారు.

## విమాన ప్రమాద మృతులకు నివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న యువకులు, నాయకులు

కథలాపూర్, జూన్ 15: గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంలో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కథలాపూర్ మండలం గంభీర్‌పూర్‌లో ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో గ్రామస్తులు నివాళులర్పించారు. యువకులు, నాయకులు బస్టాండ్ నుంచి మహాత్మాగాంధీ విగ్రహం వరకు కొవ్వొత్తులతో ర్యాలీ తీశారు.

## కూతురు మృతిపై తల్లిదండ్రుల అనుమానం

- అత్తింటి వారిపై పోలీసులకు ఫిర్యాదు

శంకరపట్నం, జూన్ 15: కూతురి మృతికి అత్తింటి వారిపై అనుమానం వ్యక్తం చేస్తూ తల్లిదండ్రులు కేశవపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా, మెట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన బిగుల్ల లక్ష్మి-పరశురాములు దంపతుల కూతురు నవ్య (23), శంకరపట్నం మండలం చింతగుట్ట గ్రామానికి చెందిన ఆడెపు సందీప్ నాలుగేండ్ల క్రితం ప్రేమించుకొని పెద్దలను ఒప్పించి 2021 ఆగస్టులో పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు కొడుకులు. కాగా, పెళ్లైన 6 నెలల నుంచే భర్త సందీప్, అతడి తల్లిదండ్రులు ఆడెపు కళ, సమ్మయ్య నవ్యను అదనపు కట్నం కోసం వేధించడం ప్రారంభించారు. ఈ క్రమంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ సైతం జరిగింది. 10 రోజుల క్రితం రూ. 2 లక్షలు తేవాలని తిరిగి హింసించగా, తన ఇద్దరు కొడుకులను తీసుకుని నవ్య పుట్టింటికి వెళ్లింది. ఈ నెల 13న సందీప్ తాను ఎలాంటి వేధింపులకు గురి చేయనని హామీ ఇవ్వడంతో నవ్య అతడిని నమ్మి, తల్లిదండులను ఒప్పించి అత్తవారింటికి చేరుకున్నది. అయితే అత్తింటికి వెళ్లిన నవ్య శనివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందని సందీప్ సమాచారం ఇవ్వగా, నవ్య కుటుంబ సభ్యులు రోదిస్తూ కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు వెళ్లారు. తమ కూతురు మరణానికి అత్తింటి వారే కారణమని అనుమానం వ్యక్తం చేస్తూ సందీప్‌తో పాటు అతడి తల్లిదండ్రులపై నవ్య తల్లి బిగుళ్ల లక్ష్మి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు.

## 18లోగా సెల్ఫ్ రిపోర్ట్ చేయాలి

కమాన్‌చౌరస్తా, జూన్ 15 : డిగ్రీ అడ్మిషన్లకు సంబంధించి దోస్త్ రెండో విడుత సీట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తయిందని, కరీంనగర్‌లోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 18లోగా తమ దోస్త్ వ్యక్తిగత లాగిన్‌లో సెల్ఫ్ రిపోర్ట్ ప్రక్రియ పూర్తి చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కే రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దోస్త్ మూడో విడుత అడ్మిషన్లు, వెబ్ ఆప్షన్ల ప్రక్రియ జూన్ 19వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు.